# పాఠశాలకు కుర్చీలు బహుకరణ



**వలేటివారిపాలెం, జనవరి 19, ప్రభాతవార్త**
మండలంలోని నలదలపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పోకూరు గ్రామానికి చెందిన ఇంటూరి కృష్ణ రూ.10వేల రూపాయల విలువ చేసే పది కుర్చీలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీరకాయల మాధవరావుకు సోమవారం బహుకరించారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ పాఠశాల వారు అడిగిన వెంటనే మంచి మనసుతో పది కుర్చీలను బహుకరించిన కృష్ణకు పాఠశాల తరుపున ధన్యవాదాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# పేదల బంధువు ఎన్టీఆర్

- బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేసింది ఆయనే
- లింగసముద్రంలో వైభవంగా ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు
- ముఖ్య అతిధిగా హాజరైన ఎమ్మెల్యే ఇంటూరి



**లింగసముద్రం, జనవరి 19, ప్రభాతవార్త**
పేద ప్రజలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప వ్యక్తి స్వర్గీయ నందమూరి తారక రామారావు అని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరినాగేశ్వరరావు కొనియాడారు. ఎన్టీఆర్ 30వ వర్ధంతి కార్యక్రమాన్ని లింగసముద్రంలో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు ముఖ్య అతిధిగా హాజరై ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో రైతులను పీడించుకు తిన్న మనుసుబు, కరణాలు, పటేల్ పట్వారి వ్యవస్థలను ఎన్టీఆర్ రద్దు చేశారని పేర్కొన్నారు. అలాగే ఫించన్ల పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత కూడా ఆయనదేనన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఎన్నో తప్పులు చేసిందని, దాని కారణంగా లింగసముద్రం మండలంలో రెవెన్యూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టి ఏడాదిలో సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఒక రైతుకు కూడా అన్యాయం జరగనివ్వకుండా చూస్తానని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. త్వరలో బీపీసీఎల్ భూమి పూజా కార్యక్రమం జరగబోతుందని, కందుకూరు నియోజకవర్గం అభివృద్దిలో దూసుకుపోతుందని చెప్పారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ప్రతి ఏడాది లింగసముద్రంలో పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించి భారీ అన్నదానం చేయటం పట్ల స్థానిక నేతలను ఎమ్మెల్యే అభినందించారు. వచ్చే ఏడాది కల్లా లింగసముద్రంలో ఎన్టీఆర్ కొత్త విగ్రహాన్ని ప్రతిష్టిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే వలేటివారిపాలెం నుంచి లింగసముద్రం వరకు డబల్ రోడ్డు పనులు త్వరలో మొదలు కాబోతున్నాయని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. సభానంతరం అన్నదానం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నాగేశ్వరరావు స్వయంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు స్థానిక నేతలు స్వచ్ఛందంగా విరాళాలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పూరిమెట్ల గురునాథం, గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్, పార్టీ నాయకులు వంకాయలపాటిమాల్యాద్రి, పిడికిటి వెంకటేశ్వర్లు, అడపా రంగయ్య, నరసయ్య, రాజవరం మాలకొండయ్య, గూడూరు కల్పన, షేక్ నాయబ్ రసూల్, సయ్యద్ రఫీ, సోంపల్లి మనోహర్, గొర్రెపాటి సాంబయ్య, ఉప్పుటూరిరమణయ్య, అంగులూరి కొండయ్య, అర్ధాకుల పెద్దసత్యం, కిలారి కొండయ్య, కిలారి రమణయ్య, బొల్లినేని రమణయ్య, మద్దెల రామారావు, మండలంలోని అన్ని గ్రామ పార్టీ అధ్యక్షులు అనుబంధ సంఘాల సభ్యులు, ఎన్టీఆర్ అభిమానులు, మహిళలు, గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# పశుఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- పశువైద్యాధికారి సుబ్రహ్మణ్యం



**లింగసముద్రం, జనవరి 19, ప్రభాతవార్త**
లింగసముద్రం పరిధిలో అన్ని గ్రామ పంచాయతీలలో ఈనెల 19వ తేదీ నుండి 31వ తేదీ వరకు ఉచిత పశువైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామని లింగసముద్రం మండల పశు వైద్యాధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. 19న చిన్నపవని, లింగసముద్రం,, 20న వెంగళాపురం, పెద్దపవని, 21న ఎర్రారెడ్డిపాలెం, ముత్యాలపాడు, 22న తిమ్మారెడ్డిపాలెం, అన్నెబోయినపల్లి, 23న మొగిలిచర్ల, వీఆర్ కోట, 24న గంగపాలెం, మాలకొండారాయునిపాలెం, 26న పెంట్రాల, విశ్వనాథపురం, 27న చెరువురాజుపాలెం, అంగిరేకులపాడు, 28న మేదరమిట్లపాలెంలో జరుగునని తెలిపారు. సోమవారం చినపవని, లింగసముద్రం మండల కేంద్రం గ్రామాలలో జరిగిన పశువైద్య శిబిరాలలో 22 పశువులకు గర్భకోశ వ్యాధులు, సాధారణ వ్యాధులకు చికిత్స, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన కల్పించారు. 48 దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. 480 గొర్రెలు, 120 మేకలకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ అవకాశాన్ని మండలంలోని పశు పోషకులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు పూరిమెట్ల గురునాథం, జేవీవో రమణయ్య, వెటర్నరీ అసిస్టెంట్ పాండురంగారావు, చౌడయ్య, కిరణ్, రమేష్, వినోద్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థలలో తేల్చుకుందామా

- డబ్బులకు పదవును కొన్నోడివి నువ్వా మాట్లాడేది
- అధికారం వచ్చిన కాన్నుంచి అవినీతి పాలన చేస్తుంది మీరేకాదా..



**పుల్లలచెరువు, జనవరి 19, ప్రభాతవార్త**
రాజకీయాలు వస్తూ ఉంటాయి పోతూ ఉంటాయి కాబట్టి ఒక వ్యక్తి గురించి మాట్లాడేటప్పుడు తమ విలువని తెలుసుకొని మాట్లాడితే అందరికి మంచిదని పుల్లలచెరువు వైసీపీ మండల కన్వీనర్ దోమకాల వెంకటేశ్వర్లు అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన యర్రగొండపాలెంలో వైసీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక ఎమ్మెల్యేని ఏకవచనంతో మాట్లాడటం మంచి పద్దతి కాదని, ఇకనైనా మీరు పద్దతి మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన ఘాటుగా హెచ్చరించారు. రాన్ను స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ దమ్మెంటో మా దమ్మెంతో తేల్చుకుందాం, అప్పటి వరకు వేచి చూడండి అని ఆయన అన్నారు. అధికారం మీదేనా కన్వీనర్ పదవి మీ నాయకుడికి డబ్బులు ఇచ్చి కొనుక్కోవడం చాలా సిగ్గుచేటు అన్నారు. అటువంటి నీవు మా నాయకుడి గురించి అసభ్యకరమైన మాటలు మాట్లాడటం మంచి పద్దతి కాదు, నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడితే నీకు మంచిదని టీడీపీ మండల కన్వీనర్ కోట్ల గోవిందుపై ఆయన విరుచుకుపడ్డారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఇసుక, మద్యం, బియ్యం, ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి దాంట్లో కమీషన్లు తీసుకొని అడ్డదారిలో జేబులు నింపుకుంటుంది మీరు కాదా అంటూ ఆయన మండిపడ్డారు. మా నాయకుడు ఎక్కడ మీ అవినీతి బాగోతాలు బయటపెడతాడు అని భయం పెట్టుకొని ఏమి చేయాలో తెలియక పిచ్చెక్కి కారుకూతలు కూస్తున్నారని ఆయన అన్నారు. మీ లాగా మేము మాట్లాడే తలుచుకుంటే మీరు తట్టుకోలేరు కాబట్టి ఎవరో ఏంటో తెలుసుకొని మాట్లాడి మీ విలువను మీరు కాపాడుకుంటే ఎంతైనా మంచిదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల నాయకులు, కన్వీనర్లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్లు, తదితరులు పాల్గొన్నారు.

# విధులకు హాజరు కాకపోతే చర్యలు

- ఎంపీడీవో శంకరరావు



**వలేటివారిపాలెం, జనవరి 19, ప్రభాతవార్త**
మండలంలోని పోలినేనిపాలెం సచివాలయంను ఎంపీడీవో వై.శంకరరావు సోమవారం తనిఖీ చేశారు. వీఆర్వో, వెటర్నరీ అసిస్టెంట్ ఆన్ డ్యూటీలో ఉన్నారు. డిజిటల్ అసిస్టెంట్ సెలవుపై వెళ్లారు. మిగిలిన సిబ్బంది నిర్ణీత సమయంలో విధులకు హాజరై ఉన్నారు. సిబ్బందికి కేటాయించిన టార్గెట్స్ పూర్తి చేయాలని ఆయన సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాలు అందరికి అందించాలని ఆయన పేర్కొన్నారు. విధులకు సక్రమంగా హాజరు కాని సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అప్పలరాజుపై పెట్టిన పీడీ యాక్ట్ రద్దు చేయాలి



**సీఎస్‌పురం, జనవరి 19, ప్రభాతవార్త**
అనకాపల్లి జిల్లా రైతు సంఘం జిల్లా కార్యదర్శి అప్పలరాజుపై పెట్టిన పీడీ యాక్ట్ రద్దు చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు అన్నారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం సీఎస్‌పురం నారాయణస్వామి కాంప్లెక్స్ నందు ఎం.రత్నారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అనకాపల్లిలో బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా ప్రజలుపోరాడుతుంటే దానికి మద్దతుగా అప్పలరాజు ఉన్నాడని, భూ సేకరణకు వ్యతిరేకంగా అడ్డు తగులుతున్నాడని, అక్కడ హోంమంత్రి అనిత కక్ష కట్టి పీడీ యాక్టు ప్రయోగించడం దుర్మార్గమన్నారు. ప్రజా ఉద్యమాలపై ఈ విధమైన ధోరణి మంచిది కాదని ఉద్యమకారులను ఒకరిని లోపల పెడితే పది మంది పుట్టుకొస్తారని హెచ్చరించారు. దొంగలు, దోపిడి దారులు, రేపిస్టులు, గంజాయి ముఠాయి, ప్రజలపై దౌర్జన్యం చేసే లాంటి వారిపై పెట్టాల్సిన పీడీ యాక్ట్ ను ఒక ఉద్యమకారునిపై పెట్టడం ఈ ఉమ్మడి ప్రభుత్వానికి తగదని గత ప్రభుత్వం ఈ భూసేకరణ వల్లనే ఇంటికిపోయిన విషయం మీకు తెలియదా అన్నారు. రైతుల నుండి భూములు లాకొన్న ప్రభుత్వం 99 పైసలకే పారిశ్రామిక వేత్తలకు అప్పగించడం సరైన పద్ధతి కాదన్నారు. పరిశ్రమలకు కావాల్సినంత భూములు పెద్దవాళ్లు ఆక్రమించుకొని ఉంటే వాళ్ల దగ్గర నుంచి భూములు తీసుకోకుండా పేదల భూములు, ప్రజల భూములు బలవంతంగా లాక్కోవడం తగదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు మండల కన్వీనర్ రాజ్యలక్ష్మీ, రైతు సంఘం మండల, అధ్యక్షుడు ఎం.రత్నారెడ్డి, అంకెపల్లి వెంకటేశ్వరరెడ్డి, గుడిపాటి నారాయణ, సుబ్బరాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బీజే రత్నం, నారయ్య, వెంకటయ్య, డీవైఎఫ్ఐ నాయకులు ఎస్.రమేష్, కేవీపీఎస్ నాయకులు రాంబాబు పాల్గొన్నారు.

# పీఆర్ రోడ్లు, డ్రైన్లు నిర్మాణంలో నాణ్యత పాటించాలి

- రూ.46 కోట్లతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ రోడ్డు నిర్మాణం
- జియోట్యాగింగ్ రెండు రోజులగా పూర్తి చేయండి
- హెల్త్ క్లీనిక్ పనులు తక్షణమే చేపట్టాలి
- స్థలం లేని చోట్ల వెంటనే కేటాయించేలా చర్యలు
- మార్చి 15లోగా నిర్మాణ పనులు పూర్తి కావాలి
- పంచాయతీ రాజ్ సమీక్షలో ఎమ్మెల్యే ఏలూరి



**మార్టూరు, జనవరి 19, ప్రభాతవార్త**
గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులు ప్రణాళికబద్ధంగా ప్రజా అవసరాలకు అనుగుణంగా చేపట్టాలని స్పష్టం చేశారు. సోమవారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద రూ.46 కోట్ల వ్యయంతో రోడ్ల, సైడు డ్రైన్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. చేపట్టిన ప్రతి అభివృద్ధి పనికి సంబంధించి జియోట్యాగింగ్ ప్రక్రియను రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో ప్రజలకు అత్యవసరంగా అవసరమైన హెల్త్ క్లీనిక్‌ల నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. నిర్మాణానికి స్థలం లేని గ్రామాల్లో వెంటనే స్థల కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అన్ని అభివృద్ధి పనులు మార్చి 15 లోగా పూర్తయ్యేలా స్పష్టమైన కార్యచరణ రూపొందించాలని సూచించారు. సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణంలో ఎక్కడా నాణ్యత లోపాలు తలెత్తకుండా పర్యవేక్షణ పెంచాలని, పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చే పనులకు ప్రాధాన్యం ఇచ్చి వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. సమీక్ష సమావేశం అనంతరం ఎమ్మెల్యే ఏలూరి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గ్రామస్తులు తెలిపిన సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటాని ఆయన హామీ ఇచ్చారు. పలు సమస్యలను ఆయా శాఖల అధికారులతో ఫోన్లో మాట్లాడి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈ ఆదినారాయణ, ఏఈలు దాసు, శాస్త్రి, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి



**వెలిగండ్ల, జనవరి 19, ప్రభాతవార్త**
మండలంలో విధులు నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి రెడ్డిగారి గంగాధర్ అన్నారు. సోమవారం మండలంలోని మొటిపల్లి, పి.రాళ్లపల్లి తదితర సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రతి ఒక్కరూ సరైన సమయంలో బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని సిబ్బంది ఆఫీసు పనిపై బయటకు వెళ్లేటప్పుడు ఎక్కడికి వెళ్తున్నారో మూమెంట్ రిజిస్టర్లో తప్పకుండా నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్ని రకాల సర్వేలను సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం ప్రజల కోసం ఏ సంక్షేమ పథకం ప్రవేశపెట్టిన ప్రజలకు వివరించి సంక్షేమ పథకాలు ప్రజలకు అందే విధంగా చూడాల్సిన బాధ్యత మీపై ఉంటుందని ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సిబ్బంది సేవలు విస్తృతం చేయాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉండాలని సిబ్బంది సమయపాలన పాటించాలని, సిబ్బంది ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రెడ్డిగారి గంగాధర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏబీసీకి పెరిగిన నీటి సరఫరా

- 33వ మైలు వద్ద 1100 క్యూసెక్కులు



**బల్లికురవ, జనవరి 19, ప్రభాతవార్త**
అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో చివరి భూములకు నీరు అందించటమే లక్ష్యంగా అధికారులు ప్రణాళిక బద్దంగా నీటి సరఫరాను పెంచుతున్నారు. ఎగువన గుంటూరు జిల్లా పరిధిలో వారబందీ విధానం కొనసాగుతున్నందున అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు అధిక నీరు విడుదల చేసేందుకు అవకాశం ఏర్పడింది. 18/0 వద్ద సోమవారం దిగువకు 1300 క్యూసెక్కుల నీరు విడుదల చేయగా, 33/2 మైలు వల్లాపల్లి లాకుల వద్ద 1100 క్యూసెక్కుల నీటి సరఫరా కొనసాగుతుందని అద్దంకి డీఈ రామకృష్ణ తెలియజేశారు. చివరి భూముల రైతులకు సైతం సాగునీరు అందించాలని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో నీటి సరఫరా పెంపుపై సాగర్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. నీటి విడుదల పెరిగిన సమయంలో సిబ్బంది మొత్తం ఏబీసీ పరిధిలో అనునిత్యం పర్యవేక్షిస్తుంటారని, సెన్సార్ల పరిధిలో ఉన్నందున కాలువ కట్టల భద్రతకు ఏ విధమైన ముప్పు లేదని అధికారులు తెలియజేస్తున్నారు.



# లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థాన ట్రస్టీ బోర్డు నియామకం



**సింగరాయకొండ, జనవరి 19, ప్రభాతవార్త**
మండలంలోని దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాత సింగరాయకొండ గ్రామం శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ క్షేత్రం, శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి నూతనధార్మిక పరిషత్ ట్రస్టీబోర్డును రాష్ట్రప్రభుత్వం నియమించింది. దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్, ఏపీ ధార్మిక పరిషత్ మెంబర్ సెక్రటరీ కె. రామచంద్ర మోహన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి పాతకోట కృష్ణవేణి చేసిన సిఫారసుల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ ట్రస్టీ బోర్డులో సీనియర్ న్యాయవాది, లక్ష్మీ నరసింహ స్వామి సేవకులుగా సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడుతో పాటు కుంచాల రమణయ్య, పర్ణశాల సిద్ధార్థ కృపాసాగర్, మసనం లక్ష్మయ్య, వాసిపల్లి శ్రీనివాసులు, పొట్లూరి బాలకోటేశ్వరరావు, గొల్లపోతు బాలకోటమ్మ, అంబటి కోటేశ్వరమ్మ, పెద్దిశెట్టి ప్రమీల, కొణిజేటి వెంకట కవిత దేవి, శీలం సుమా బాలలను నియమించారు. ప్రత్యేకసభ్యుడిగా ఆలయ అర్చకుడు ఉదయగిరి వెంకటశేషలక్ష్మీ నరసింహాచార్యులను నియమించారు. ఈ ట్రస్టీ బోర్డు నియామకానికి సహకరించిన రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, రాష్ట్ర మారిటైమ్ బోర్డుచైర్మన్ దామచర్ల సత్యనారాయణతో పాటు ఎన్‌డీఏ కూటమి నాయకులకు ట్రస్టీ సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

# పశు భీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**పొన్నలూరు, జనవరి 19, ప్రభాతవార్త**
పశువులకు పశు భీమా పథకం అందుబాటులో ఉందని దానిని రైతులు పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి శివరామకృష్ణ అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపాలెం లో సోమవారం పశువైద్య శాఖ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా రైతులకు 7 శాతం వడ్డీతో రెండు లక్షల వరకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వడం జరుగుతుందని అలాగే పశువులకు ఎద కి వచ్చినపుడు లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగించి 90 శాతం ఆడ దూడలు జన్మించే విధంగా కేవలం 150 రూపాయలకే వీర్య నాలికలు అందుబాటులో ఉన్నాయని మరియు పశువులకు పశుభీమా పథకం అందుబాటులో ఉన్నాయని వీటిని రైతులందరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ శిబిరం నందు 30 గేదెలకు చూడి నిర్ధారణ పరీక్షలు మరియు గర్భకోశ వ్యాధులకు చికిత్సను అందించారు.. అదేవిధంగా 42 దూడలకు, 1100 గొర్రెలకు నట్టల నివారణ మందు తాపించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొర్రపాటి సురేంద్ర, మండల టిడిపి అధ్యక్షులు అనుమోలు సాంబయ్య, పశుసంవర్ధక సహాయకులు మాల్యాద్రి, నవనీత్ మరియు రైతులు పాల్గొన్నారు.

# తూర్పు గంగవరం గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా గుజ్జు



**తాళ్లూరు, జనవరి 19, ప్రభాతవార్త**
మండలంలోని తూర్పు గంగవరం గ్రామ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీఅధ్యక్షుడిగా గుజ్జుల వెంకటేశ్వరరెడ్డి (గోల్డ్) నియమిస్తూ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ప్రకటించారు. సోమవారం దర్శి పార్టీ కార్యాలయంలో గ్రామ కమిటీల నియామకం సమావేశం నిర్వహించారు.



అందులో వెంకటేశ్వర రెడ్డి నిజమకానికి గ్రామంలోని నాయకులతో చర్చించి ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ తనను గ్రామ పార్టీ అధ్యక్షుడుగా నియమించిన బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలకు, పదవి వచ్చేందుకు కృషిచేసి మండల, గ్రామ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో పదవి బాధ్యతలు అప్పజెప్పిన వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా గ్రామంలో తన వంతు సేవలు అందిస్తానని, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి తన వంతు కృషిచేస్తానని ఆయన పేర్కొన్నారు. వెంకటేశ్వరరెడ్డిను నాయకులు గుజ్జుల యోగిరెడ్డి, గూడా గోపాల్ రెడ్డి, యత్తపు మధుసూదనరెడ్డి, గోపు శ్రీనివాస్‌రెడ్డి, దుద్దుకూరి శ్రీనివాస్‌రెడ్డి, గుద్దేటి శ్రీనివాస్‌రెడ్డి, షేక్ ఫజుల్, వంశీ, బచ్చా, ముసలారెడ్డి, పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.

# పాఠశాల ఆకస్మిక తనిఖీ





**హనుమంతునిపాడు, జనవరి 19, ప్రభాతవార్త**
హనుమంతునిపాడు మండలం మహమ్మదాపురం పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మార్కాపురం ఉప విద్యాశాఖాధికారి ఎం.శ్రీనివాసులు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పదవ తరగతి వంద రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా జరుగుతున్నపదోతరగతి స్టడీఅవర్స్ ను పరిశీలించారు. తదుపరి ఉపాధ్యాయులతో పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి, పదవతరగతి పరీక్ష ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆదేశించి, తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి వంద రోజుల కార్యచరణ ప్రణాళిక జరిగే తీరుతెన్నులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఊరే రాధాకృష్ణను అడిగి, వివరాలు తెలుసుకొని, మెచ్చుకున్నారు. అనంతరం ప్రార్ధన ప్రాంగణంలో జరిగే ప్రార్ధనలో పాల్గొని, ప్రార్ధన జరిగే విధానంను చూసి సంతోషించారు. విద్యార్థులతో ముచ్చటించి, అమూల్యమైన సందేశాన్ని ఇచ్చారు. ఆ తర్వాత పాఠశాలలో గల గ్రంధాలయంను సందర్శించి, అందలి పుస్తకాలను పరిశీలించారు. గ్రంధాలయం ఆవశ్యకతను వివరించారు. ప్రతి విద్యార్థి నిత్యం గ్రంధాలయంను సందర్శించాలని, పుస్తక పఠనం చేయాలని తెలియజేశారు. పాఠశాల గ్రంధాలయ నిర్వహణ వారిని ఎంతగానో ఆకట్టుకుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల పనితీరును మెచ్చుకున్నారు. విద్యార్థుల ప్రగతి, ప్రతిస్పందనలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తపరిచారు.

## టోర్నమెంట్ విజేతకు విన్నర్స్ ట్రోఫితో పాటు 20 వేల నగదు బహుమతిని అందజేసిన వైసీపీ స్టేట్ ఐటీ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల



**హనుమంతునిపాడు, జనవరి 19, ప్రభాతవార్త**
మండలంలోని దొడ్డిచింతల గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గత నాలుగు రోజులుగా నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్‌కు ముఖ్యఅతిధిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ ఐటీ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల విజయభాస్కర్‌రెడ్డి హాజరై టోర్నమెంట్ విజేతకు విన్నర్స్ ట్రోఫితో పాటు రూ.20వేలు నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందించడమే కాకుండా శారీరక ఆరోగ్యాన్ని కూడా పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ యువతను క్రీడల వైపు ప్రోత్సహించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజం నిర్మించవచ్చని ఆయన అన్నారు. వారం రోజుల పాటు విజయవంతంగా టోర్నమెంట్‌ను నిర్వహించిన నిర్వాహకులను ఆయన హృదయపూర్వకంగా అభినందించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాడని ప్రశంసించారు. విజేతలతో పాటు రన్నర్స్‌కు కూడా శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని క్రీడాకార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గాయం బలరాంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఎక్కంటి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ భవనం కృష్ణారెడ్డి, గ్రామ కన్వీనర్ కోటపాటి మోహన్‌రెడ్డి, హాజీపురం గ్రామ కన్వీనర్ చిట్యాల నాగార్జునరెడ్డి, తిరుపతిరెడ్డి, దుబాయ్ వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు రవీంద్రారెడ్డి, సోషల్ మీడియా విభాగానికి చెందిన వేసపోగు సుందర్, ఇతర గ్రామ పెద్దలు, యువత, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఓటమి గెలుపునకు తొలి అడుగు

- క్రీడా స్ఫూర్తిని చాటిన దద్దాల నారాయణ యాదవ్

**కనిగిరి, జనవరి 19, ప్రభాతవార్త**
ప్రతి ఓటమి మరో గెలుపునకు పునాది వేస్తుంది. క్రీడల్లో గెలుపోటముల కంటే క్రీడా స్ఫూర్తితో పాల్గొనడమే ముఖ్యం అని కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పేర్కొన్నారు. పీసీపల్లి మండలం వెంగళాపురంలో వైసీపీ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జై గంగా భవాని క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకల్లో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.

**మైదానంలో మెరిసిన నేత :**
ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ స్వయంగా బ్యాట్ పట్టి క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడారు. రాజకీయ నాయకుడిగా కాకుండా ఒక క్రీడాకారుడిగా ఆయన మైదానంలో సందడి చేయడం చూసి యువత కేరింతలతో ఉత్సాహపరిచారు. క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా, మానసిక ఉల్లాసానికి, యువతలో ఐక్యతను పెంపొందించడానికి ఎంతగానో తోడ్పడతాయని ఆయన కొనియాడారు.

**విజేతలకు నగదు బహుమతులు :**
హోరాహోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మారెళ్ళ జట్టు విజేతగా నిలవగా, వెంగళాపురం జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతలకు దద్దాల నారాయణ యాదవ్ ట్రోఫీలతో పాటు దాతలు సమకూర్చిన నగదు బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతి రూ.20,116(దాత పరిమితి వెంకటేశ్వర్లు చౌదరి), ద్వితీయ బహుమతి రూ.15,116(దాత చెన్నుపాటి వెంకటరావు చౌదరి)లను అందజేసి ఘన సన్మానం చేశారు. క్రీడలను ప్రోత్సహిస్తూ యువతలో ధైర్యాన్ని నింపుతున్న దద్దాల నారాయణ యాదవ్‌ను స్థానిక నాయకులు, నిర్వాహకులు పుష్పగుచ్ఛాలతో, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, సర్పంచ్ శానం మల్లిఖార్జున, శానం పెద్ద వెలుగొండయ్య, రేగుల బాలయ్య చౌదరి, నాగోతు శ్రీకాంత్ చౌదరి, వద్దంపూడి ప్రసాద్ చౌదరి, నెలకుర్తి రమణయ్య చౌదరి, భారీ సంఖ్యలో వైసీపీ శ్రేణులు యువకులు పాల్గొన్నారు.





7_7.qxd 1/20/2026 12:06 AM Page 1



### బాధితులకు త్వరిత న్యాయం లక్ష్యంగా మీకోసం : జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు

**- జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక 37 ఫిర్యాదుల స్వీకరణ**



**మార్కాపురం జిల్లా, జనవరి 19, ప్రభాతవార్త**

బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడమే లక్ష్యంగా జిల్లా ఇన్చార్జి ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు సోమవారంమార్కాపురం జిల్లాపోలీస్ కార్యాలయంలో మీకోసం ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతన జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల ఫిర్యాదులను ఎస్పీ స్వయంగా స్వీకరించి, బాధితులతో నేరుగా మాట్లాడి సమస్యలను సవివరంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మొత్తం 37 ఫిర్యాదులు అందగా, ప్రతి ఫిర్యాదుపై చట్టప్రకారం విచారణ జరిపి నిర్ణీత గడువులో పరిష్కారం అందిస్తామని బాధితులకు భరోసా ఇచ్చారు. అందిన ఫిర్యాదుల వివరాలను సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలియజేసి, వేగవంతమైన విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భూ వివాదాలు, ఉద్యోగ మోసాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక మోసాలు, చీటింగ్ కేసులు తదితర సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేశారు. వృద్ధులు, నడవలేని పరిస్థితిలో ఉన్నవారి సమస్యలను ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకొని సంఘటన స్థలాలను సందర్శించి తక్షణ న్యాయం అందించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కాపురం డీఎస్పి యు నాగరాజు, మార్కాపురం సిఐ సుబ్బారావు, త్రిపురాంతకం సిఐ అసం, గిద్దలూరు అర్బన్ సీఐ కె సురేష్, పొదిలి సిఐ రాజేష్ కుమార్ తదితర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మార్కాపురంలో బీజేపీ జనతా వారధి కార్యక్రమం

**- ప్రజల సమస్యల పరిష్కారానికి వారధిగా పార్టీ**



**మార్కాపురం, జనవరి 19,ప్రభాతవార్త**

రాష్ట్రవ్యాప్తంగాభారతీయ జనతాపార్టీ నిర్వహిస్తున్న జనతా వారధి కార్యక్రమం మార్కాపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన కలెక్టర్ కార్యాలయం సమీపంలోవిజయవంతంగాజరిగింది. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి,మార్కాపురం–ఎర్రగొండపాలెం–దర్శి నియోజకవర్గాల ఇంచార్జ్ తంగిరాల అశోక్ రెడ్డి అధ్యక్షత వహించారు. సామాజిక అంశాలు, వ్యక్తిగత సమస్యల పరిష్కారంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని, వాటి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవడమే జనతా వారధి కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అశోక్ రెడ్డి తెలిపారు. ప్రజలు తమ సమస్యలను బీజేపీ దృష్టికి తీసుకువస్తే, సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ ప్రజలకు న్యాయం జరిగేలా పార్టీ వారధిగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రజలకు చేరువయ్యే ప్రక్రియలో ఎలాంటి అడ్డంకులు తలెత్తకుండా అన్ని విధాల సహకరించడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, గిద్దలూరు–కనిగిరి నియోజకవర్గం ఇంచార్జ్ జేవీ నారాయణ, జిల్లా కార్యదర్శి మద్దెల లక్ష్మీ, మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు షబానా, సీనియర్ నాయకులు చిన్నయ్య, వీర రాఘవ రెడ్డి, డాక్టర్ కిరణ్ కుమార్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాంజి యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు రామేశ్వర్ రెడ్డి, ఎలగపాటి పోలయ్య, మార్కాపురం పట్టణ ప్రధాన కార్యదర్శి సతీష్, పుల్లలచెరువు మండల అధ్యక్షులు యోగేశ్వర్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేమన బోధనలు నేటికీ మార్గదర్శకం

**- యోగి వేమన జయంతిని ప్రభుత్వ సెలవుగా ప్రకటించాలన్న రెడ్డి సంఘం డిమాండ్**



**మార్కాపురం, జనవరి 19,ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లా కేంద్రంలోని దోర్నాల బస్టాండ్ సెంటర్‌లో ఉన్న రెడ్డి సంక్షేమ సేవా సంఘం కార్యాలయంలో యోగి వేమన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగి వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాట్లాడిన సంఘ సభ్యులు యోగి వేమన ఒక గొప్ప సంఘ సంస్కర్తగా, రచయితగా, కవిగా ప్రజలకు అనేక సేవలు అందించారని గుర్తు చేశారు. వేమన బోధనలు నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని, వేమన తెలియని వారు, వానకు తడవని వారు లేరని వ్యాఖ్యానించారు. అటువంటి మహనీయుడిని స్మరించుకోవడం ఎంతో గర్వకారణమని తెలిపారు. యోగి వేమన చేసిన సేవలను ప్రభుత్వం అధికారికంగా గుర్తించి, ఆయన జయంతిని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని రెడ్డి సంక్షేమ సేవా సంఘం నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు గుంటక సుబ్బారెడ్డి, రూరల్ అధ్యక్షుడు కుందూరు రమణారెడ్డి, గోరంట్ల చిన్న వెంకటరెడ్డి, గోగిరెడ్డి వెంకటనారాయణ రెడ్డి, రావి చెంచి రెడ్డి, గుంటక భాస్కర్ రెడ్డి, వెన్న వెంకటరెడ్డి, గోలమారి కాశిరెడ్డి, బత్తుల వెంకటరెడ్డి, కుందురు మల్లారెడ్డి, రమణారెడ్డి, బలరాం రెడ్డి, యోగి రెడ్డి, నాగిరెడ్డి, రాంరెడ్డి, రంగారెడ్డి తదితర రెడ్డి సంఘ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

### జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు

**- నూతన జిల్లాకు అనుగుణంగా విభాగాల ఏర్పాటు వేగవంతం చేయాలని అధికారులకు సూచనలు**

**- మౌలిక సదుపాయాలు, భద్రత, పరిశుభ్రతపై సమగ్ర సమీక్ష**



**మార్కాపురం, జనవరి 19,ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లా పోలీస్ కార్యాలయాన్ని జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు సోమవారం సందర్శించారు.జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణాన్ని పరిశీలించి,వివిధ విభాగాల నిర్వహణకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, స్థలాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. డిసిఆర్‌బీ, స్పెషల్ బ్రాంచ్,ఐటి కోర్, డీపీఓవంటి కీలకవిభాగాలఏర్పాట్లకు సంబంధించిన పనులను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. నూతన జిల్లాకు అనుగుణంగా అన్ని విభాగాలు సమర్థవంతంగా పనిచేసేలా మౌలిక సదుపాయాల కల్పన వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అలాగే పోలీస్ క్వార్టర్స్ పరిసర ప్రాంతాలను కూడా పరిశీలించిన ఎస్పీ, అక్కడ భద్రతా ఏర్పాట్లు, పరిశుభ్రత, మౌలిక వసతులపై పలు సూచనలు చేశారు. పోలీస్ సిబ్బందికి అవసరమైన వసతులు మెరుగుపరచడంతో పాటు, కార్యాలయాల్లో సమర్థవంతమైన పరిపాలన, నిర్వహణ ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ యం.శ్రీనివాసరావు, మార్కాపురం సీఐ యం సుబ్బారావు, మార్కాపురం టౌన్ ఎస్ఐ సైదులుబాబు, పెద్దారవీడు ఎస్ఐ సాంబశివయ్యతో పాటు ఇతర పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యుత్ ఛార్జీలపై ఈ నెల 20న బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ



**మార్కాపురం, జనవరి 19,ప్రభాతవార్త**

విద్యుత్ చార్జీల టారిఫ్‌లపై ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ నుంచి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మార్కాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పివి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నాలుగు రోజుల పాటు జరిగే ఈ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని తిరుపతి, విజయవాడ, కర్నూలు నగరాల్లో నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. ఈనెల 20న తిరుపతిలో, 22 మరియు 23 తేదీలలో విజయవాడలో, 27న కర్నూలులో ఉదయం 10.30 గంటల నుంచి ఒంటి గంట వరకు, అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ప్రజాభిప్రాయాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. విద్యుత్ చార్జీలపై తమ అభిప్రాయాలు వెల్లడించదలచుకున్న వినియోగదారులు మార్కాపురం డివిజన్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు.

## మార్కాపురంలో సైనిక కాలనీ ఏర్పాటు చేయాలి

**- జాయింట్ కలెక్టర్‌కు మాజీ సైనికుల వినతి**



**మార్కాపురం, జనవరి 19, ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో రిటైర్డ్ ఆర్మీ ఎంప్లాయిస్ హౌసింగ్ బోర్డ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు చిన్నయ్య ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులును కలిసి సైనిక కాలనీ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు చిన్నయ్య మాట్లాడుతూ సుమారు 700మంది మాజీ సైనికులతో జై జవాన్ అసోసియేషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. గత ఆగస్టు నెలలోనే సైనిక కాలనీ ఏర్పాటు చేయాలని అప్పటి ప్రకాశం జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లకు వినతిపత్రం అందజేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం తమ సొసైటీలో 370 మంది మాజీ సైనికులు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ జీవో ప్రకారం ప్రతి మాజీ సైనికుడికి 175 చదరపు గజాల చొప్పున భూమి కేటాయించి సైనిక కాలనీ ఏర్పాటు చేయాలని వారు కోరారు. మార్కాపురం ఇలాకాలో 1475 నుంచి 1479 వరకు ఉన్న సర్వే నంబర్లలో ప్రభుత్వ భూములు ఉన్నాయని, వాటిని పరిశీలించి సైనిక కాలనీ ఏర్పాటు చేసే విధంగా చర్యలుతీసుకోవాలని జాయింట్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ఈ వినతిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, విషయాన్ని సవివరంగా పరిశీలించి సంబంధిత శాఖల ద్వారా నివేదికలు తీసుకుని తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు సొసైటీ ప్రతినిధులు తెలిపారు.

## కందుకూరు ట్విడ్‌కో కాలనీలో పోలీసుల సోదాలు



**కందుకూరు జనవరి 19, ప్రభాతవార్త**

కందుకూరు పట్టణంలోని ఉప్పుచెరువు సమీపంలో ట్విడ్‌కో కాలనీలో సోమవారం పోలీసుల సోదాలు నిర్వహించారు.అసాంఘిక కార్యక్రమాల నిర్వహణపై పలు అనుమానాల నివృత్తి మరియు ముందుస్తు జాగ్రత్త కోసం ఈ కార్యక్రమం చేపట్టారు. కందుకూరు సిఐ అన్వర్ బాషా ఆధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కందుకూరు డివిజన్ డీఎస్పీ సిహెచ్.వి.బాలసుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాలనీలోని సుమారు 443 కి పైగా ఇళ్లను పోలీసులు ఇంటింటికి వెళ్లి పరిశీలించారు.ఇందుకోసం ఇద్దరు సీఐలు ఆధ్వర్యంలో 20మందికిపైగా పోలీసులు ఆరు బృందాలుగా పాల్గొన్నారు.అయితే ఎక్కడా అసాంఘిక శక్తులు గానీ,చర్యలుగానీ లేకపోవడం గమనార్హం.దీంతో కాలనీవాసులకు ముందుస్తు చర్యలుగా పలు సలహాలు సూచనలు చేశారు.కాలనీవాసులతో కలిసి కాలనీలో ర్యాలీ నిర్వహించారు.గంజాయితోపాటు పలు అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉంటామని కాలనీవాసులుతో ప్రతిజ్ఞచేయించారు.కాలనీలో ఎటువంటి చట్టవిరుద్ధ చర్యల కదలికలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తామని కాలనీవాసులు పోలీసులకు తెలిపారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ 91 వాహనాలను అనుమతిపత్రాలులేనివిగా గుర్తించినట్లు తెలిపారు.మత్తుపదార్థాల వినియోగించవద్దని. చట్టవిరుద్ధచర్యలుకు పాల్పడవద్దని సూచించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ,సీఐలతోపాటు పట్టణ ఎస్సై పులి నాగరాజు, రూరల్ ఎస్సై బి బి నాయక్‌తోపాటు పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి : కాలనీవాసులు**

టిడ్కో కాలనీ పట్టణ శివార్లులో ఉంది. పట్టణానికి సుమారు 3.కిమీ దూరంలో ఉంది.గత కొంతకాలంగా పలు అసాంఘిక కార్యక్రమాలకు అనువుగా ఉందన్న ప్రచారం ఉంది. పట్టణంలో ఎటువంటి అసాంఘిక సంఘటనలు జరిగినా కాలనీవైపు చూడడం ఆనవాయితీ. పైగా కాలనీలోకి నిత్యం కొత్తకొత్త వ్యక్తుల రాకపోకలు ఉంటాయి. అక్కడ ఏమి జరుగుతుందో పక్కంటికి కూడా తెలియని పరిస్థితి నెలకొంది. పైగా ఇళ్ల యజమానులు అదికశాతం తమ ఇళ్లను బాడుగలకు ఇచ్చి, పట్టణంలో నివాసం ఉంటుంటారు.ఈ నేపద్యంలో పరిసర ఇళ్లలో ఎవరు,ఎంతకాలం ఉంటారో తెలియని పరిస్తితి.దీంతో కాలనీవాసులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.సంఘటన జరిగినా తరువాత పోలీస్ చర్యలుతో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.సరియైన సమాచారంకోసం కాలనీవాసులను నిందించడం,బెదిరించడం, అనుమానించడం తరచూ జరుగుతుంది.కావున కాలనీలో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటుచేయాల్సిందిగా పలువురు కాలనీవాసులు అదికారులుకు విజ్ఞప్తిచేస్తున్నారు.తద్వారా నేరప్రవృత్తిని అదుపులో ఉంచొచ్చని పలువురు కాలనీవాసులు సూచిస్తున్నారు.

## కోవూరులో ఉచిత పశువైద్యశిబిరం



**కందుకూరు జనవరి 19, ప్రభాతవార్త**

కందుకూరు మండలంలోని కోవూరులో సోమవారం స్థానిక పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డా॥ వై. శ్రీకాంత్ పాల్గొని వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న రకరకాల సంక్షేమపథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఇందులో బాగంగా ఈ నెల 30వరకు మండలంలోని అన్ని గ్రామాలలో పశుఆరోగ్యపరిరక్షణ నిమిత్తం వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గొర్రెలు మేకలు, గేదెలు, దూడలకు ఉచిత నట్టల నివారణ మందులు అందచేయనున్నట్లు తెలిపారు.అవసరమైన జీవాలకు తక్షణమే వైద్యసౌకర్యాలు అందించడం జరుగుతుందన్నారు.అనంతరం పలు పశువులకు, సన్నజీవాలకు వైద్యసేవలు అందించారు. నట్టల నివారణ మందు అందచేశారు.ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సిబ్బంది పి.విజయ,వి.వేణు, రాములు,లోకేష్,శోభన్ బాబు,రఫీ తదితరులు పాల్గొన్నారు

### సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది

**- ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి**



**రాచర్ల, జనవరి 19 ,ప్రభాతవార్త**

ప్రజా సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన అర్జీలన్నీ క్షుణ్ణంగా పరిశీలించి విచారించి చట్టబద్ధంగా ఉన్న ప్రతి అర్జీకి పరిష్కారం చూపిస్తామని పరిష్కారం కాని వాటికి గల వివరాలను తెలుసుకొని అవి ఎందుకు పరిష్కారం కావు వారికి తెలియజేస్తామని తెలిపారు. అధికారులు సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్య వహించవద్దని తెలిపారు. ప్రజల నుండి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ప్రజాధర్బార్‌లో 43అర్జీలు వచ్చాయని ఆయన తెలిపారు. ముందుగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు భూ సమస్యలు, పెన్షన్లు, గృహ నిర్మాణ, ఉపాధి, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖలకు సంబంధించి వివిధ రకాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఎల్ వెంకటేశ్వర్లు, రాష్ట్ర జిబిసి డైరెక్టర్ కే యోగానంద్, రాచర్ల, రామాపురం సొసైటీ బ్యాంకు చైర్మన్లు జి జీవనేశ్వర్ రెడ్డి, బి పుల్లారెడ్డి, ఒంగోల్ జిల్లా పార్లమెంట్ ట్రెజరర్ ఏ శ్రీనివాస్ రెడ్డి, గిద్దలూరు ఏఎంసీ చైర్మన్ బి బాలయ్య, కూటమి నాయకులు, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు అలసందలపల్లెలో విద్యుత్ సరఫరా నిలిపివేత

**కొమరోలు, జనవరి 19 ,ప్రభాతవార్త**

మండలంలోని తాటిచెర్ల మోటు విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలోని అలసందల పల్లెగ్రామంలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. అలసందల పల్లె గ్రామంలో ఆర్డీఎస్ఎస్ కొత్త లైన్ వేయడం జరుగుతుంది కావున ఉదయం 9గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపియడం జరుగుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన పేర్కొన్నారు.

### యువత క్రీడలపై ఆసక్తి కనబరచాలి

**- టిడిపి ఒంగోలు పార్లమెంట్ కోశాధికారి అంబవరం శ్రీనివాస్ రెడ్డి**



**రాచర్ల, జనవరి 19, ప్రభాతవార్త**

యువత క్రీడలపట్ల ఆసక్తిని కనబరచాలని టిడిపి ఒంగోలు పార్లమెంట్ కోశాధికారి అంబవరం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సంక్రాంతి సందర్భంగా మండలంలోని అనుముల వీడుగ్రామంలో క్రికెట్‌పోటీలు నిర్వహించగా అనుముల వీడు జట్టుపై కంభం జట్టు విజయం సాధించగా గెలుపొందిన జట్టుకు సోమవారం ఆయన ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లతీఫ్, నాయకులు డివి రమణారెడ్డి, పి కృష్ణారెడ్డి,వి.శివరామిరెడ్డి, పి.బ్రహ్మానందరెడ్డి,పి.ఆంజనేయులు,నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## 31 వరకు పశువైద్య శిబిరాలు



**రాచర్ల, జనవరి 19, ప్రభాతవార్త**

మండలంలో ఈనెల 19వ తేదీ సోమవారం నుండి 31వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని పశువైద్యాధికారి డి హరిబాబు తెలిపారు. పశువైద్య శిబిరాలను సోమవారం ఆయన కాల్వపల్లి గ్రామంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా 10సూడు 3గుడ్డుమోతు గేదెలకు చికిత్సలు చేసి మందులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు ఎదసూదులు, గర్భకోశ వ్యాధులకు చికిత్సతో పాటు, పశువుల దూడలు, ఆవులు, గొర్రెలు, ఎద్దులు, మేకలు అన్నింటికీ పరీక్షలు నిర్వహించి నట్టల నివారణ, తదితర మందులు అందిస్తామని పశుపోషకులకు తెలిపారు. పశుపోషకులు అందరూ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎస్ఏలు శివచరణ్, సుప్రియ ఏహెచ్ఏలు వీఏలు మంజు నాయక్, రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఈకేవైసీ అనంతరం నూతన పాస్ పుస్తకాలు మంజూరు

**లింగసముద్రం, జనవరి 19, ప్రభాతవార్త**

మండలంలోని పలు గ్రామాలకు సంబంధించిన రీ సర్వే జరిగిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీలో భాగంగా ఈనెల 20న ఉదయం 11గంటల నుండి గ్రామ సభ జరుగునని, సదరు గ్రామసభలో మీ పట్టాదారు పాస్ పుస్తకం యొక్క నకలు ఇవ్వడునని, సదరు నకలు నందు తప్పులు ఉన్నట్లయితే రైతులు సరి చూసుకున్న అనంతరం ఈకేవైసీ చేయలేనని, ఈకేవైసీ చేసిన తదుపరి ప్రింట్ చేసి నూతన పాస్ పుస్తకాలు మంజూరు చేయబడుతుందని, రైతులు తప్పక ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అనుమయమ్మ ఒక ప్రకటనలో తెలిపారు.

## రమణయ్యకి నివాళి



**తాళ్లూరు, జనవరి 19,ప్రభాతవార్త**

తాళ్లూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కొత్తపల్లి రమణయ్య (55) అనారోగ్యంతో మృతి చెందాడు.వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాదు రెడ్డి సోమవారం అక్కడికి వెళ్లి భౌతిక గాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు.ఆయన వెంట జిల్లా సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, సర్పంచ్ చార్లెస్ సర్జన్,మాజీ జడ్పీటీసీ లోకిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి,నాయకులు కొర్రపాటి విష్ణు, ప్రభుదాస్ , నాగళ్ల వెంకట్రావు, కోట కృష్ణారెడ్డి, మన్నే రెడ్డి ,స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

### నందమూరి విగ్రహావిష్కరణకు టీడీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలి



**పామూరు, జనవరి 19, ప్రభాతవార్త**

పామూరు మండల కేంద్రమైన అయ్యవారిపల్లె గ్రామం వద్ద ఏర్పాటు చేసిన నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ మంగళవారం సాయంత్రం 4.30గంటలకు మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, కనిగిరి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొని నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ, బష్ షెల్టర్ ప్రారంభోత్సవ, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చేస్తారని ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు, నందమూరి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ రమా శ్రీనివాసులు తెలిపారు.

## తక్కెళ్ళపాడులో ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు



**సంతనూతలపాడు, జనవరి 19, ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండలం పి.తక్కెళ్ళపాడు గ్రామంలో ఆదివారం రాత్రి మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 30వ వర్ధంతి వేడుకలను గ్రామ టీడీపీ అధ్యక్షులు నలుమోతు శ్రీనివాసరావు తదితరులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి గ్రామ టీడీపీ అధ్యక్షులు ఎన్.శ్రీనివాసరావు, గుమ్మలంపాడు సొసైటీ డైరక్టర్ టి.నరసింహారావు, టీడీపీ నాయకులు నేతి రాజేష్, గుంటూరి పిచ్చయ్య తదితులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం అన్నదాన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోకూరి సుజిత, టీడీపీ నాయకులు నలుమోతు లక్ష్మీ నారాయణ, బోయపాటి వెంకటరావు, పోకూరి లక్ష్మీ నారాయణ, వెంకటరావు, సుందర్‌రావు, కొల్లి శ్రీనివాసరావు, కుంచాల రాములు, డి.బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

### 21న నియోజకవర్గస్థాయిలో సంతనూతలపాడు మండలంలో విద్యార్థులకు వివిధ పోటీలు

**- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ,నియోజకవర్గ స్థాయి ఎన్నికల రిటర్నింగ్ అధికారి మాధురి వెల్లడి**



**సంతనూతలపాడు, జనవరి 19, ప్రభాతవార్త**

జాతీయ ఓటర్ల దినోత్సవంలో భాగంగా ఈనెల 21వ తేదీ సంతనూతలపాడు మండలంలో సంతనూతలపాడు నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, డిబెట్, తదితర పోటీలు జరగనున్నట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, సంతనూతలపాడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కే.మాధురి పేర్కొన్నారు. ఒంగోలులోని కలెక్టరేట్ నందు గల కేఆర్‌సీ తన కార్యాలయం నందు సోమవారం నాడు జరిగిన సంతనూతలపాడు నియోజకవర్గ స్థాయి తహసీల్దార్లు అయిన, ఏఈఆర్‌ఓలకు జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 27వ తేదీన అన్ని కేంద్రాల్లో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఈఆర్వో మాధురి పేర్కొన్నారు. రాష్ట్ర సీఈఓ, జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వారి ఆదేశాల మేరకు జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవం యొక్క థీమ్ నా భారత్ నా ఓటు ట్యాగ్ లైన్ భారత ప్రజా స్వామ్యానికి కేంద్ర బిందువు పౌరుడుగా నిర్ణయించడమైనట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధురి వెల్లడించారు. దివ్యాంగులు, మహిళలు, వృద్ధులు, సమాజంలోని నాజుకు వర్గాలను భాగస్వాములను చేసుకొని ఈ కార్యక్రమాలు నిర్వహించాలని సంతనూతలపాడు నియోజకవర్గ స్థాయి ఎన్నికల రిటర్నింగ్ అధికారి మాధురి పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీన సంతనూతలపాడు మండలంలో జరిగే నియోజకవర్గ స్థాయి పోటీల్లో గెలుపొందిన వారు ఈనెల 23వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత లభించునని ఆమె తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విజేతలు జిల్లా స్థాయిలో పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో సంతనూతలపాడు, చీమకుర్తి, నాగులుప్పలపాడు, మద్దిపాడు, మండలాల అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్లు, ఆయా మండలాల తహసీల్దార్లు ఎస్ఎల్ నారాయణరెడ్డి, ఆర్.బ్రహ్మయ్య, కే.ప్రవీణ్ కుమార్, వేమూరి ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

### మన రాష్ట్రానికి కోట్ల మంది పేదలకు నష్టం చేసే

## కొత్త ఉపాధి చట్టాన్ని ఐక్యంగా అడ్డుకోవాలి

**- సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు**



**సంతనూతలపాడు, జనవరి 19, ప్రభాతవార్త**

పేద వర్గాలకు నష్టం చేసే కొత్త చట్టాన్ని ఐక్యంగా ఎదుర్కొనాలని సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు పిలుపునిచ్చారు. సంతనూతలపాడు మండలం మైనంపాడులో సోమవారం నాడు జరిగిన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దీనికి సంబంధించి కరపత్రాలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మాబు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసే కుట్రలో భాగంగా పథకం పేరు మార్చి మత వివాదాన్ని సృష్టించడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఇచ్చేటువంటి నిధులు తగ్గించి రాష్ట్రాలపై భారం మోపుతుందని అన్నారు. దీని కారణంగా పనులు కోల్పోయి గ్రామీణ ప్రాంతాల్లో వలసలు పెరిగి ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందని ఆయన వాపోయారు. కార్పొరేట్ కంపెనీలకు, భూస్వాములకు ప్రయోజనాలు కల్పించడం కోసం ప్రభుత్వం ఈ చెడు చేపట్టిందన్నారు. ఉపాధి హామీ పనిని రక్షించుకోవడానికి పాత పథకాన్ని అమలు చేయాలని కోరుతూ భవిష్యత్తులో జరిగే ఆందోళనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కరపత్రాలు పంపిణీ కార్యక్రమంలో భాగంగా మాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బంకా సుబ్బారావు, సీపీఎం నాయకులు కరిచేటి హనుమంతరావు, గుండవరపు వెంకట సుబ్బారావు, షేక్ నాయబ్, కొండ్రాజు జయరాం తదితరులు పాల్గొన్నారు.

## ఎదురెదురు ద్విచక్ర వాహనాలు ఢీ



**కురిచేడు, జనవరి 19, ప్రభాతవార్త**

ఎదురెదురు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో బాలిక కాలకు తీవ్ర గాయమైన సంఘటన సోమవారం కురిచేడు మండలం బోధనంపాడు వద్ద చోటు చేసుకుంది. బోధనంపాడుకు చెందిన పయ్యావుల పెద్దకోటయ్య తన మనుమరాలు రూపశ్రీతో కలిసి పొలం వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా అతి వేగంతో వస్తున్న గుర్తు తెలియని ద్విచక్ర వాహనం వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో రూపశ్రీ కాలకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు 108కి కాల్ చేసి సమాచారం అందించారు. 108సిబ్బంది పైలెట్ కృంగి నరేష్‌బాబు, ఈఎంటీ బాలజ్యోతి క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసుకుంటూ దర్శి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### పేదలకు అండగా స్నేహహస్తం ట్రస్టు

**- కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో భోజన వసతి**



**కనిగిరి, జనవరి19, ప్రభాతవార్త**

కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం స్నేహహస్తం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రోగులు, వారి బంధువులు, పేదవారికి ఉచిత భోజన వసతి కల్పించారు. ట్రస్టు సభ్యులు స్వయంగా భోజనం పంపిణీ చేస్తూ, ప్రేమ పరమార్ధంతో ఆదుకోవాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కన్వీనర్ సుధీర్‌బాబు మాట్లాడుతూ పేదవారికి ఆహారం సమకూర్చడం చాలా ఆనందం అనిపిస్తోంది. మానవసేవే మాధవసేవ అన్న భావనతో మనం చేసిన చిన్న సహాయం కూడా ఎన్నో కుటుంబాల్లో ఆశ నింపగలదు.ఈ ప్రయత్నం నిరంతరంగా కొనసాగుతూ మరెందరికో ఉపశమనం కలిగించాలని కోరుకుంటున్నాం అని అన్నారు. ఆసుపత్రిలో చేరిన అనేక మంది రోగులు, వారి బంధువులు, అలాగే ఆహార వసతి లేక ఇబ్బంది పడే పేదవారు ఈ సేవలతో ఆనందం వ్యక్తం చేశారు. స్థానికులు ట్రస్టు చర్యను ప్రశంసిస్తూ ,ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని నిలబెడతాయని వ్యాఖ్యానించారు. ట్రస్టు సభ్యులు ఈ సందర్భంగా భవిష్యత్తులోనూ పేదలకు భోజన వసతి, వైద్య సహాయం, విద్యా రంగంలోనూ సాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది, స్నేహహస్తం సభ్యులు మీరా మొహిద్దిన్, బేబి రాజ్, మోహన్ కుమార్, గౌస్, లక్ష్మణాచారి, ఇమామ్ హుస్సేన్, కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

8_8.qxd 1/20/2026 12:07 AM Page 1



## తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నేతలను మర్యాదపూర్వకంగా కలిసిన ఫిరోజ్



**కనిగిరి, జనవరి 19, ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయం మంగళగిరిలో సోమవారం కనిగిరి పట్టణ టీడీపీ అధ్యక్షులు షేక్ ఫిరోజ్ మర్యాదపూర్వకంగా పలువురు ప్రముఖ రాష్ట్ర నాయకులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, రాష్ట్ర సీడాప్ చైర్మన్ జి.దీపక్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌లను కలిశారు. మూడు రోజుల పార్టీ శిక్షణ నిమిత్తమై కేంద్ర కార్యాలయానికి వెళ్ళటం జరగటంతో రాష్ట్ర నేతను కలవటం ఆనందంగా ఉందని ఫిరోజ్ అన్నారు.

## రబీ 2025-26 నుంచి ఈ పంటలో నూతన విధానాలు

### - రైతుల ధృవీకరణ తప్పనిసరి



**కనిగిరి, జనవరి 19, ప్రభాతవార్త**

రబీ 2025-26 సీజన్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఈ పంట నమోదు విధానంలో కీలక మార్పులు చేసినట్లు కనిగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు షేక్ జైనులబ్దిన్ తెలిపారు. రైతులు సాగు చేసిన పంట వివరాలను స్వయంగా పరిశీలించడానికి, తప్పులు ఉంటే ఫిర్యాదు చేయడానికి, సరిగా ఉంటే ధృవీకరించడానికి డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. కేఏఆర్ఎస్‌హెచ్ఏకే. ఏపీ. జీవోవీ. ఇన్, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. అగ్రికల్చర్. ఏపీ. జీవోవీ. ఇన్ వెబ్‌సైట్ల ద్వారా అవకాశం కల్పించినట్లు తెలిపారు. రైతులు ఆధార్ నంబర్‌తో లాగిన్ అయి వివరాలను తెలుసుకోవచ్చని చెప్పారు. పంట నమోదు తేదీకి రెండు రోజులు ముందు గ్రామ వ్యవసాయ సహాయకులు ఎస్ఎంఎస్ ద్వారా రైతులకు సమాచారం పంపుతారని, నమోదు పూర్తయ్యాక మరొక ఎస్ఎంఎస్ ద్వారా పంట వివరాలు తెలియజేస్తారని పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగా రైతులు నమోదు సమాచారాన్ని పరిశీలించి ఎటువంటి పొరపాట్లు లేకుంటే ధృవీకరించాలి, తప్పులుంటే ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. పంటల సాగు పరిస్థితులను ఏఐ టెక్నాలజీ ద్వారా విశ్లేషణ చేస్తున్నట్లు వెల్లడించారు. కనిగిరి వ్యవసాయ ఉప విభాగంలో ఖరీఫ్ 2025-26లో లక్ష్యమైన 29,050 హెక్టార్లకు బదులుగా 37,154 హెక్టార్లలో సాగు జరగగా, కంది పంట దాదాపు 7వేల హెక్టార్లు అధికంగా విత్తనమైందని తెలిపారు. రబీ సీజన్‌లో లక్ష్యమైన 24,316 హెక్టార్లలో ఇప్పటి వరకు 12,000 హెక్టార్లు మాత్రమే సాగు పూర్తైందని, వర్షాభావం కారణంగా మినుము సాగు తగ్గిందని పేర్కొన్నారు. ఈ పంట నమోదు ఫిబ్రవరి 22వ తేదీ లోపు తప్పనిసరిగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని, రైతులు ఈ నూతన మార్పులను ఉపయోగించుకొని నమోదు పక్రియలో భాగస్వాములు కావాలని షేక్ జైనులబ్దిన్ విజ్ఞప్తి చేశారు.

## నేడు మోడల్ స్కూల్ రోడ్డుకు శిలాఫలక ఆవిష్కరణ

### - విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రాక



**కనిగిరి, జనవరి 19, ప్రభాతవార్త**

కనిగిరి మండలంలో మోడల్ స్కూల్ రోడ్డు అభివృద్ధి పనుల కోసం శిలాఫలకం ఆవిష్కరణ మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు జరగనుందని, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కొండా కృష్ణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కనిగిరి ఎమ్మెల్యే, ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి హాజరు కానున్నారు. కార్యక్రమ విజయవంతం కోసం మండలంలోని 25 గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, గ్రామ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్, యూనిట్, బూత్ బాధ్యులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు, మహిళా కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు.

## రాష్ట్ర నేతలను మర్యాదపూర్వకంగా కలిసిన నాగార్జున యాదవ్



**కనిగిరి, జనవరి 19, ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ రాష్ట్రకార్యాలయం మంగళగిరిలో సోమవారం కనిగిరి పట్టణ టీడీపీ కార్యదర్శి చీర్ల నాగార్జున యాదవ్ మర్యాదపూర్వకంగా పలువురు ప్రముఖ రాష్ట్ర నాయకులను సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, రాష్ట్ర సీడాప్ చైర్మన్ జి.దీపక్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లతో సమావేశమయ్యారు. మూడు రోజుల పార్టీ శిక్షణ కార్యక్రమం నిమిత్తం రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి వచ్చిన సందర్భంలో ప్రముఖ నేతలను కలవడం సంతోషకరమని నాగార్జున యాదవ్ తెలిపారు.

## నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణంతో మౌళిక వసతులు ఏర్పాటు - మంత్రి గొట్టిపాటి



**సంతమాగులూరు , జనవరి 19, ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన 18 నెలల కాలంలోనే అద్దంకి నియోజకవర్గ పరిధిలో సుమారు రూ.90 కోట్లతో వివిధ రహదారుల నిర్మాణం చేపట్టామని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఒక్క రోడ్డు కూడా సరిగా వేయలేదని ఆయన విమర్శించారు. అద్దంకి నియోజవర్గానికి మరో 30 ఏళ్లు ఎటువంటి ఇబ్బందులూ లేని విధంగా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని 100కిపైగా గ్రామాల్లో అవసరమైన కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశామని, 7 సబ్ స్టేషన్ల నిర్మాణం కూడా చేపడుతున్నామన్నారు. వైద్య పరమైన ఇబ్బందులను తొలగించడానికి నియోజకవర్గం మొత్తం 30 సబ్ హెల్త్ సెంటర్ల నిర్మాణానికి మంత్రి సత్యకుమార్ యాదవ్ ద్వారా 10 కోట్లు నిధులు కూడా మంజూరు చేశారని మంత్రి చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం సామాజిక పింఛన్లను పెంచడంతో పాటు వైసీపీ ప్రభుత్వం అర్థంతరంగా నిలిపి వేసిన లక్షన్నర వితంతు పెన్షన్లను కూడా ఒకేసారి మంజూరు చేశామని తెలిపారు. గ్రామాల్లో గ్రూపులు లేకుండా అందరూ కలసి ఉండాలని మంత్రి గొట్టిపాటి స్థానిక నేతలకు, కార్యకర్తలకు సూచించారు. అందరూ కలసి ఉంటేనే పార్టీ కూడా బలంగా ఉంటుందన్నారు. అనంతరం కొప్పరం గ్రామంలో గ్రీవెన్స్ సెల్ నిర్వహించి ప్రజల సమస్యలను స్వీకరించారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట శాసనసభ్యులు చదలవాడ అరవిందబాబు, సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ తేలప్రోలు రమేష్, యం పిపి ఏనుబర్ల యల్లమంద మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు చేవూరి వాసు రెడ్డి, బాపట్ల పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు ఆలూరి శ్రీనివాసరావు, సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు సన్నెబోయిన గురు యాదవ్, సొసైటీ మాజీ అధ్యక్షులు చింతా శ్రీధర్ బాబు, గడ్డం నాగిరెడ్డి, మండలం ఐ టిడిపి ఉపాధ్యక్షులు మొగిలి సుబ్బారావు, రావిలేలా కాశీవిశ్వనాథం, సర్పంచ్ ఐనాల గోపి, జమ్ముల రాంబాబు, ఐనాల శ్రీను, షేక్ సుభాని( బోడ) గుంజి లక్ష్మయ్య, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## గుర్రాల కాలనీలో పెద్ద ఎత్తున పోలీసులు తనిఖీలు

### - గంజాయి, ఆయుధాలపై ప్రత్యేక సోదాలు - 24 వాహనాలు స్వాధీనం

### - దర్శి డిఎస్‌పి ఆధ్వర్యంలో కార్డన్ చెర్చ్





**అద్దంకి, జనవరి 19,ప్రభాతవార్త**

అద్దంకి పట్టణంలోని గుర్రాల కాలనీలో సోమవారం అద్దంకి డిఎస్‌పి లక్ష్మీనారాయణ ఆధ్వర్యలంలో అద్దంకి సి.ఐ. సుబ్బరాజు సారద్యంలో దర్శి సబ్‌డివిజన్‌లోని పలువురు సి.ఐ.లు, ఎస్.ఐ.లు, పోలీసు సిబ్బంది పెద్ద ఎత్తున సోదాలు నిర్వహించారు. ప్రత్యేకంగా గుర్రాల కాలనీలో గంజాయి, ఆయుధాలపై ప్రతి ఇంటిలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరియైన పత్రాలు లేని 24 వాహనాలను ఈ తనిఖీలలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కాలనీ వాసులకు డిఎస్‌పి ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు అయిన గంజాయి, మత్తు పదార్థాల వాడకం వలన తలెత్తే సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అదే విధంగా కాలనీలో మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని, కాలనీవాసులుతో కలిసి పోలీసులు కాలనీ అంతటా అవగాహన ర్యాలీని నిర్వహించారు. కాలనీవాసులచే ఈ సందర్భంగా డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా వుంటామని ప్రత్యేకంగా డిఎస్‌పి వారిచేత ప్రతిజ్ఞ చేయించారు.

## కనిగిరి నియోజకవర్గంలో మంత్రి గొట్టిపాటి పర్యటన



**అద్దంకి , జనవరి 19, ప్రభాతవార్త**

రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం కనిగిరి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 2గంటలకు కనిగిరి టౌన్‌లో కందుకూరు రోడ్డునుండి శంఖవరం సిసి రోడ్డు ప్రారంభోత్సవం, 2.45గంటలకు పిసిపల్లి మండలం మురుగుమ్మిలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ, 3.30గంటలకు దివాకరపల్లి గ్రామంలో రిలయన్స్ సిబిజి ప్లాంట్ పరిశీలన, 4గంటలకు సిసి రోడ్డు ప్రారంభం, 4.30గంటలకు అయ్యావారిపల్లెలో ఎన్‌టిఆర్ విగ్రహం, బస్‌షెల్టర్ ప్రారంభోత్సవ కార్యక్రమాలలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొంటారని ఆయన కార్యాలయ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

## హనుమాయమ్మకు చింతలపూడి నివాళి



**సంతమాగులూరు , జనవరి 19,ప్రభాతవార్త**

మండలంలోని కుదుర్రు గ్రామానికి చెందిన శ్రీనివాసరావు, మాతృమూర్తి మృతిచెందగా ఆమె పార్థివదేహానికి అద్దంకి వైసిపి ఇన్‌చార్జి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

## ఐటిడిపి ఉపాధ్యక్షుడుగా శ్రీనివాసరావు



**సంతమాగులూరు , జనవరి 19, ప్రభాతవార్త**

మండల ఐటిడిపి ఉపాధ్యక్షుడుగా కొప్పరం గ్రామానికి చెందిన మొగిలి శ్రీనివాసరావును నియమించినట్లు మండల పార్టీ అధ్యక్షుడు చేవూరి వాసురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## సంక్షేమ పథకాలకు ఆద్యుడు స్వర్గీయ నందమూరి - మంత్రి గొట్టిపాటి





**సంతమాగులూరు , జనవరి 19,ప్రభాతవార్త**

రాష్ట్రంలో అమలవుతున్న అనేక సంక్షేమ పథకాలకు మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆద్యుడని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని కొప్పరం, పత్తేపురం గ్రామాలలోనందమూరి తారకరామారావు విగ్రహాలను మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆవిష్కరించారు. అనంతరం మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ వరి అన్నం తినే పరిస్థితులు లేని రోజుల్లో పేదవాడు కూడా సంతృప్తిగా భోజనం చేయాలనే ఆలోచనతో కిలో బియ్యం రెండు రూపాయిల పథకాన్ని ఎన్టీ రామారావు ప్రారంభించారని వెల్లడించారు. అదే విధంగా తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఎన్టీఆర్ ప్రవేశ పెట్టిన మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, పేదలకు పక్కా ఇళ్లు, విద్యార్థులకు గురుకుల పాఠశాలలు వంటి పథకాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయాయని గుర్తు చేశారు. ఇటువంటి ఎన్నో సంక్షేమ పథకాలను అనంతర కాలంలో దేశంలోని అనేక రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని అమలు చేస్తున్నాయని స్పష్టం చేశారు. తెలుగోడి ఆత్మగౌరవం కోసమే ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపిస్తే, సీఎం చంద్రబాబు నాయుడు తెలుగు వారి కీర్తిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లారని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ కొనియాడారు. భావి తరాల భవిష్యత్తు కోసమే చంద్రబాబు అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు. ఉద్యోగాల కోసం ఆంధ్రప్రదేశ్ యువత బెంగళూరు, హైదరాబాద్ కు వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. రాష్ట్ర యువతకు ఇక్కడే ఉద్యోగాలు రావాలనే తపనతోనే రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనలకు, పెట్టుబడుల కోసం సీఎం చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నట్లు మంత్రి రవికుమార్ వెల్లడించారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని యస్ యల్ గుడిపాడు, కుందుర్రు గ్రామాల పరిధిలో రైతుల సహకారంతో వెయ్యి ఎకరాలు భూమి ని తీసుకుని విండ్ ఎనర్జీ మానిఫ్యాక్చరింగ్ హబ్‌తో పాటు సోలార్ ప్యానల్ తయారీ పరిశ్రమలను ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇటువంటి పెద్ద పరిశ్రమలు ఏర్పాటు అయితే అద్దంకి పరిసర ప్రాంతాల యువతకు కొంతమేర ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. బాపట్ల జిల్లా నుండి అద్దంకి నియోజకవర్గం ను ప్రకాశం జిల్లాలో కలపడంతో పాటు అద్దంకి రెవిన్యూ డివిజన్ ఏర్పాటు కూడా సీఎం చంద్రబాబు వల్లే జరిగిందన్నారు.

## గోశాలకు ట్రక్కు వరిగడ్డి వితరణ



**అద్దంకి , జనవరి 19, ప్రభాతవార్త**

హరి హర గోకులం వెల్ఫర్ సొసైటీ గోశాలకు అద్దంకికి చెందిన మాగులూరి దశరథ రామాంజనేయులు, వెంకటాపురం గ్రామానికి చెందిన కఠారి రామకోటిరెడ్డిలు 17వేల రూపాయలతో ఒక ట్రక్కు వరిగడ్డిని నిర్వాహకులు గోనుగుంట సుబ్బారావుకు అందజేవారు.

## 12వ వార్డులో మొక్కలు పంపిణీ



**అద్దంకి , జనవరి 19, ప్రభాతవార్త**

గ్రీన్ అద్దంకి కార్యక్రమంలో భాగంగా ఆనలుగురు చారిటబుల్ ట్రస్టు ద్వారా అద్దంకి 12వ వార్డు కౌన్సిలర్ అత్తులూరి రమేష్, ట్రస్టు నిర్వాహకులు ఆర్.శివాంజనేయులు ఆధ్వర్యంలో మొక్కలు నాటేకార్యక్రమాన్ని నిర్వహించారు.

## విద్యుత్ షాక్‌తో విద్యార్థిని మృతి



**అద్దంకి, జనవరి 19, ప్రభాతవార్త**

మండలంలోని తిమ్మాయిపాలెం పరిధిలో సోమవారం తిమ్మాయిపాలెం, కుంకుబాడు రోడ్డులో ఆ గ్రామ సమీపంలో గల ఇటుక బట్టీ వద్ద విద్యుత్ షాక్‌తో దాసరి సుస్మిత (14) అనే విద్యార్థిని మృతిచెందింది. అందిన వివరాలు ప్రకారం అద్దంకి పట్టణంలోని గుర్రాలకాలనీకి చెందిన దాసరి సింగయ్య దంపతులు బట్టీ వద్ద నివాసం వుంటూ ఇటుక తీత పనులు నిర్వహిస్తున్నారు. సుస్మిత తల్లిదండ్రుల వద్దకు వెళ్ళినట్లు సమాచారం. అయితే ఇటుక తీత పనులు పూర్తి అయి వారువుంటున్న గదిలోకి వెళ్ళి ఫాన్ స్విచ్ వేసే ప్రయత్నంలో సుస్మితకు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు సమాచారం. అయితే బాలికను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా బాలిక మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు.

## తల్లిదండ్రుల జ్ఞాపకార్థం స్టడీ మెటీరియల్ పంపిణీ

### - ఔన్నత్యాన్ని చాటుకున్న పూర్వపు విద్యార్థి



**పెద్దదోర్నాల, జనవరి 19, ప్రభాతవార్త**

తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలవడం నిజమౌన ఔన్నత్యానికి నిదర్శనం. అదే భావతో తన చదువులకు పునాది వేసిన పాఠశాలపై కృతజ్ఞతతో ఓ పూర్వ విద్యార్థి విద్యార్థుల భవిష్యత్తు కోసం ముందడుగు వేశాడు. పెద్దదోర్నాల మండలం వై.చెర్లోపల్లి కి చెందిన పాఠశాల పూర్వపు విద్యార్థి రాము నాయక్ సోమవారం జరిగిన కార్యక్రమంలో పదవ తరగతి చదువుకుంటున్న విద్యార్థినీ, విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేసి ఔన్నత్యాన్ని చాటుకున్నాడు. అదే క్రమంలో గత ఏడాదిలో ఉత్తమ ఫలితాలు సాధించి 1,2,3 స్థానాలలో నిలిచిన విద్యార్థులకు పారితోషికం అందించారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థి రాము నాయక్ మాట్లాడుతూ ఉన్న ఊరు కన్న తల్లి లాంటిది అని, ఇక్కడ విద్యార్థులకు తన వంతు సహాయం చేయడం ఆనందంగా ఉందని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చదువుపై ఆసక్తిని పెంచడమే కాకుండా మానవీయ విలువలను నేర్పుతాయని హెడ్‌మాస్టర్ పేరయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ కే.పోలయ్య, ఉపాధ్యాయులు యు.బాల గురువులు, ఆర్.బాదుర్ నాయక్, చిరంజీవి, ఆర్.రుప్ల నాయక్, వెంకటేశ్వర్లు, జయప్రకాష్, గ్రామ పెద్దలు భూపాల్‌రెడ్డి, రాములు నాయక్, బి.వెంకటేశ్వర్లు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



**కొనకనమిట్ల, జనవరి 19, ప్రభాతవార్త**

మండలంలోని గొట్లగట్టు, వెలిగండ్ల, మునగపాడు గ్రామాలలో సోమవారం గొట్లగట్టు పశువైద్యాధికారిణి వి.రాజ్యలక్ష్మీ ఆధ్వర్యంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ్యలక్ష్మీ మాట్లాడుతూ ఈ శిబిరాలలో 5246 గొర్రెలు, మేకలకు, 67 దూడలకు నట్టల నివారణ మందు తాపించడం జరిగిందన్నారు. 18 గేదెలకు కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు, 15 గేదెలకు చూడి పరీక్షలు, అనారోగ్యంతో ఉన్న పశువులకు, గొర్రెలకు మందులు పంపిణీ చేయడం జరిగింది. పశువుల భీమా పథకం గురించి తెలియజేశారు. గొర్రెలు, మేకలలో వచ్చే బొబ్బ వ్యాధికి టీకాలు వేయించుకోవాలని గొర్రెల కాపరులకు సూచించారు. ఈనెల 31 వరకు ఈ పశు వైద్య శిబిరాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెరిక సుఖదేవ్, టీడీపీ నాయకులు పరిటాల సుబ్బయ్య, వేముల తిరుపతయ్య, పొదిలి తిరుపతయ్య, రవి, పోలసాని నారాయణరెడ్డి, సతీష్, వెలిగండ్ల, పాతకోట బసవారెడ్డి, మడతల చెన్నారెడ్డి, మునగపాడు కైపు అంజిరెడ్డి, పశుపోషకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ వరలక్ష్మీ, వెటర్నరీ అసిస్టెంట్ పూర్ణ చంద్రరరావు, మండలంలోని రైతు సేవా కేంద్రం పశు వైద్య సహాయకులు, ఆఫీస్ సబార్డినేట్ కాసు వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## 29న సుబ్రమణ్యేశ్వరస్వామి శాంతి కళ్యాణం



**బల్లికురవ, జనవరి 19, ప్రభాతవార్త**

మండలంలోని కొణిదెన గ్రామంలోని బ్రహ్మగుండం పుణ్యక్షేత్రం వద్ద వేంచేసియున్న వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి, ఈనెల 29న పవిత్ర భీష్మ ఏకాదశి సందర్భంగా ఆరవ శాంతి కళ్యాణ మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని నిర్వహణ కమిటీ తెలియజేసింది. ఈ సందర్భంగా గణపతి పూజ, కలశారాధన, శాంతి కళ్యాణం కొనసాగుతుందన్నారు. వల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణం నిర్వహించడం ద్వారా భక్తులకు శుభాలు, సంతానం, ఆటంకాల నివారణ, శ్రేయస్సును కలిగిస్తుందని ప్రగాడంగా విశ్వసిస్తారు. ఇది విశ్వ శక్తుల ఐక్యతకు కూడా ప్రతీక. అవివాహితులు ఈ కళ్యాణం చూస్తే వారికి వివాహం, సంతాన భాగ్యం కలుగుతుందనేది నమ్మకం. సర్పదోశం, కుజదోశం, తగ్గించడంతో పాటు సంపద, శాంతి, శ్రేయస్సు, విద్యా సంబంధాలలో విజయాలు చేకూరుతాయని ప్రగాఢ విశ్వాసం. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా శాంతి కళ్యాణాన్ని పేర్కొంటారు. ఈ కళ్యాణ మహోత్సవంలో పరిసర గ్రామాల ప్రజలు పాల్గొని, స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని నిర్వహణ కమిటీ విజ్ఞప్తి చేసింది.

## ప్రజా సమస్యల పరిస్కారమే ప్రధాన ధ్యేయం

### - జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు

### - మార్కాపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే 168 అర్జీలు స్వీకరణ




**మార్కాపురం, జనవరి 19,ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రజలసమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 168 అర్జీలు స్వీకరించారు. వాటిలో రెవిన్యూ క్లినిక్‌కు సంబంధించినవి 92 అర్జీలు, ఇతర శాఖల సమస్యలకు సంబంధించినవి 76 అర్జీలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. భూ సమస్యలు, పట్టాదారు పాసు పుస్తకాలు, సర్వే, వారసత్వ హక్కులు, సంక్షేమ పథకాలు, విద్యుత్, తాగునీరు, గృహ నిర్మాణం, రోడ్లు తదితర అంశాలపై ప్రజలు తమ ఫిర్యాదులు సమర్పించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ పులి శ్రీనివాసులు స్వయంగా ప్రజల వద్దకు వెళ్లి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విన్నారు. సంబంధిత శాఖల అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. అర్జీలను కేవలం స్వీకరించడమే కాకుండా, పరిష్కారానికి స్పష్టమైన గడువులు నిర్ణయించి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్‌కు హాజరైన జిల్లా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భోజన వసతి, తాగునీరు, కూర్చోవడానికి ఏర్పాట్లు తదితర అన్ని సౌకర్యాలను కలెక్టర్ కార్యాలయ అధికారులు సమర్థవంతంగా ఏర్పాటు చేశారు. దీంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి అర్జీపై బాధ్యతతో వ్యవహరించి న్యాయం చేయాలని జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. గ్రీవెన్స్ డే కార్యక్రమం ప్రజలకు ప్రభుత్వానికి మధ్య నేరుగా సంబంధాన్ని మరింత బలోపేతం చేస్తోందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## నేడు శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం

### - ఆలయంలో ప్రత్యేక పూజలు



**అద్దంకి, జనవరి 19, ప్రభాతవార్త**

అద్దంకి పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం అగ్నిప్రవేశ విశ్వరూప సందర్శన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. వాసవీ, మూలమంత్ర హోమం నిర్వాహణ జరుగుతుంది. ఉదయం 4.30 గంటలకే సుప్రభాత సేవ, 6గంటలకు వేదపారాయణం, 10 గంటలకు మహిళా భక్తులచే, సామూహిక శ్రీలలిత సహస్రనామ పారాయణం నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్ష, కార్యనిర్వాహక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఊటుకూరి రామకోటేశ్వరరావు, చిన్ని లక్ష్మీ శ్రీనివాసరావు, అరవపల్లి హనుమంతరావు, నేరేళ్ళ శ్రీనివాసరావు, పోకూరి శ్రీనివాసరావులు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.

## సీజనల్ వ్యాధుల పట్ల పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలి



**సీఎస్‌పురం, జనవరి 19, ప్రభాతవార్త**

సీజనల్ వ్యాధుల పట్ల పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ షేక్ మునీర్ అన్నారు. మండలంలోని రేగులచెలక గ్రామంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులు, గొర్రెలు, మేకలను ఆశించే వ్యాధులు, లక్షణాలు, నివారణ చర్యలను గురించి వివరించారు. ఈ సందర్భంగా 22 పశువులకు సాధారణ చికిత్సలు, 5 పశువులకు కృత్రిమ గర్భధారణ, 8 పశువులకు చూడి నిర్ధారణ పరీక్షలు, 92 గేదెలకు నట్టల నివారణ, 385 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ 180 గొర్రెలకు మసూచి నివారణ టీకాలు వేసినట్లు డాక్టర్ మునీర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కే.తిరుపతయ్య, వీఏహెచ్ హనుమంత్, శివన్నారాయణ, రమణయ్య, విజయ్, నాగవేణి, పశుపోషకులు పాల్గొన్నారు.

## రవీంద్రపై ఆరోపణలు సరికాదు




**సీఎస్‌పురం, జనవరి 19, ప్రభాతవార్త**

తన సర్వీస్ రిజిస్టర్‌లో తప్పులు సవరించాలని కోరుతున్న ఉపాధ్యాయుడు బత్తుల రవీంద్రపై అక్రమంగా డిప్యూటేషన్ పొందినట్లుగా ఒక ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ చేసిన ఆరోపణలు సరికాదని ఏపీటీఎఫ్ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు షేక్ నాయబ్ రసూల్ అన్నారు. సోమవారం స్థానిక పాఠశాలలో ఏపీటీఎఫ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయబ్ రసూల్ మాట్లాడుతూ పామూరు హైస్కూల్‌లో 830 మంది విద్యార్థులు ఉన్నారని, ఒక్క మ్యాథ్స్ టీచర్ మాత్రమే ఉన్నారని, మరో మ్యాథ్స్ టీచర్ అవసరం అని అధికారులు ఆర్డర్ ఇచ్చి పంపించడం వలన రవీంద్ర డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారని, అంతే తప్ప ఎక్కడా అక్రమాలు, అవినీతి జరగలేదన్నారు. ఈ సందర్భంగా మండలంలోని టీచర్లకు ఇన్‌కంట్యాక్స్ ఫారాలు పంపిణీ చేశారు. ఏపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి జేఎస్ ఆనంద్‌బాబు, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణలు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని, పీఆర్సీ కమీషన్ నియమించాలన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న గ్రాట్యుటీ లీవ్ ఎన్కాష్మెంట్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## పశుపోషకులు భీమా చేసుకోవాలి - ఏడీఏ డాక్టర్ చెన్నకేశవులు




**వలేటివారిపాలెం, జనవరి 19, ప్రభాతవార్త**

మండలంలోని వివిపాలెం, పోకూరు గ్రామంలో పశుఆరోగ్య శిబిరం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంను వలేటివారిపాలెం సహాయ సంచాలకులు డాక్టర్ ఇ.చెన్నకేశవులు ప్రారంభించారు. రెండు గ్రామాలలో గొర్రెలు, మేకలు, దూడలు, పెద్ద పశులుకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. పశుభీమా పథకం ద్వారా గేదెలు, గొర్రెలు, మేకలకు ఇన్సూరెన్స్ చేయాలని మేలు జాతి పశువుకు రూ.30వేలు భీమా చేయుటకు 85శాతం సబ్సిడీతో రైతుకు రూ.288 ప్రీమియం చెల్లించాలని, నాటు గేదెలకు రూ.15000 భీమా చేయుటకు రూ.144 రూపాయలు ప్రీమియం చెల్లించిన మూడు సంవత్సరాల వరకు ఇన్సూరెన్స్ ఉంటుందని చెప్పారు. గొర్రెలు, మేకలకు రూ.6వేలకు భీమా చేయుటకు రూ.27రూపాయలు ఒక సంవత్సరానికి, రూ.40లు రెండు సంవత్సరాలకు, రూ.56లు మూడు సంవత్సరాలకు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని అందరూ ఉపయోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోకూరు పశు వైద్యులు డాక్టర్ ఎస్ సుధాకర్, వివిపాలెం సర్పంచ్ సాదు శ్రీలత, మాజీ ఎంపీటీసీ వలేటి నర్సింహం, మాజీ సొసైటీ ప్రెసిడెంట్ వలేటి నర్సింహం, వలేటి మధుసూదన్‌రావు, పోకూరు సొసైటీ ప్రెసిడెంట్ ఘట్టమనేని లక్ష్మీ నరసింహం, సోమినేని తిరుమలరావు, నవులూరి రమణయ్య, సన్న జీవాల రైతులు, పశుపోషకులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

